క్లుప్తంగా

అయోధ్య అక్షతల పంపిణీ



తంగుడుబిల్లి రామాలయం వద్ద అయోధ్య అక్షతల కలశాలతో భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ, తంగుడుబిల్లి గ్రామాల్లో ఇంటింటా అయోధ్య అక్షతల పంపిణీ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆయా రామాలయల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీరామ భక్తజన బృంద సభ్యుల ఆధ్వర్యంలో అయోధ్య నుంచి తెచ్చిన అక్షత కలశాలతో ఊరేగింపు చేపట్టారు. కోలాటాలు, చెక్క భజనల కళాకారులు శ్రీరామనామాన్ని జపిస్తుండగా ఇంటింటికీ వెళ్లి పవిత్ర అక్షతలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సత్యనారాయణ, చందక చిన్నంనాయుడు, గ్రామ పెద్దలు చందక విశ్వనాథం, కోరాడ శ్రీను, ఆల్తి నల్లిబాబు, శ్రీరామ భక్తులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయవచ్చు..



పూసపాటిరేగ హరిజన కాలనీలో ముగ్గులు వేస్తున్న మహిళలు

పూసపాటిరేగ: రంగవల్లుల పోటీలతో మహిళలలో ఉండే సృజనాత్మకతను వెలికితీయవచ్చునని పేరాపురం సర్పంచ్ రౌతు శ్రీరామ్మూర్తి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని హరిజన కాలనీ, పేరాపురంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంధి కృష్ణాజీ, టి. సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో గోదాదేవి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఏటా ధనుర్మాస ముగింపును పురస్కరించుకొని భోగి పండగ నాడు గోదాదేవి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.. ఇందులో భాగంగా గోదా అమ్మవారిని మంగళవాయిద్యాల నడుమ పల్లకిలో ఊరేగించారు. అనంతరం రామకోనేరు వద్ద అమ్మవారి విగ్రహానికి నలుగు పూసి స్నానం చేయించారు. గోదాదేవిని పెళ్లి కుమార్తెలా అలంకరించి దేవాలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. రామ సన్నిధిలో ప్రత్యేక పూజలనంతరం గోదాదేవికి శ్రీకృష్ణపరమాత్ముడిచే కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఈఓ కిషోర్‌కుమార్, అర్చకులు సాయి రామాచార్యులు, వరప్రసాద్, రామగోపాల్, భక్తులు పాల్గొన్నారు.

శ్రీ క్షేత్రంలో..



విజయనగరం రూరల్: శ్రీ క్షేత్రంలో తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: ప్రముఖ భారతీయ తత్వదర్శన కేంద్రం శ్రీ క్షేత్రమ్‌లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయం అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, శ్రీనివాస రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ధర్మకర్త దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజ మన్నే, భక్తులు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మీ దేవిగా దర్శనం

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు ఆదివారం భోగి పండగ సందర్భంగా భక్తులకు భాగ్యలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ భక్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



భాగ్యలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న రాజరాజేశ్వరీదేవి

ఆనందాల భోగి..



విజయనగరం టౌన్: చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న ఆలయ ఈఓ సుధారాణి



డెంకాడ: పినతాడివాడలో భోగి మంట వద్ద పెద్దలు, చిన్నారులు



విజయనగరం టౌన్: భోగిమంట వేసిన పైడితల్లి ఆలయ అధికారులు, సిబ్బంది



పూసపాటిరేగ: బూడివీధిలో భోగిమంట

కష్టాలన్నీ భోగి మంటలతో పోయి సంక్రాంతి నుంచి సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ వాడవాడలా భోగి పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సూర్యుడు దక్షిణాయణంలో ఉండే చివరి రోజే భోగి పండుగ. ఈ రోజున చలి తీవ్రస్థాయిలో ఉంటుంది కాబట్టే భోగి మంటలు వాతావారణంలో కాస్త వెచ్చదనాన్ని నింపుతాయి. గ్రామాలు, పట్టణాల్లో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ వేకువజామునే నిద్ర లేచి స్నానపానాదులు పూర్తి చేసుకుని భోగి మంటలు వేశారు. చిన్నారులు కొత్త దుస్తులు ధరించి, ఆవుపేడతో చేసిన పిడకలు మంటలో వేసి సందడిగా గడిపారు. అలాగే ఆలయాల్లో ప్రత్యేక పూజలు, గోదాదేవి కల్యాణాలు నిర్వహించడంతో పాటు చిన్నారులకు భోగి పండ్లు పోశారు. పైడితల్లి అమ్మవారికి పంచదార చిలుకలను నివేదించారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



నెల్లిమర్ల రూరల్: వల్లూరులో కోలాటం ఆడుతున్న చిన్నారులు

దుస్తుల పంపిణీ



పూసపాటిరేగ: కందివలసలో దుస్తులు పంపిణీ చేస్తున్న సక్కాన రమణ తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కందివలసలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సక్కాన రమణ సహకారంతో ఆదివారం నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా దుస్తులు పంపిణీ చేస్తుంటామన్నారు. ఈ ఏడాది 600 మందికి చీర, జాకెట్, పంచె, తువ్వాలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

రెల్లివలసలో..

రెల్లివలస గ్రామంలో వెంపడాపు సూర్యనారాయణ, ఇజ్జరోతు ఈశ్వరరావు, చల్లవానితోటలో పతివాడ శ్రీనివాసరావు నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

నిత్యావసరాలు..

విజయనగరం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని మదర్‌థెరిసా సేవా సంఘం ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అయన్నపేట జంక్షన్‌లో గల సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు త్యాడ ప్రసాద్‌పట్నాయక్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వేణుగోపాలం, శ్రీనివాస్, ఝాన్సీ, తనీష్, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

చీరలు, దుప్పట్ల పంపిణీ..

విజయనగరం: నగరంలోని సంపత్ వినాయకస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కొత్తపేటలో ఆలయ ధర్మకర్త ఎడ్ల పైడిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సిరిసహస్ర చేతుల మీదుగా దుస్తులు అందజేశారు. అంతకుముందు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసహస్ర మాట్లాడుతూ, హిందువులంతా సంప్రదాయబద్ధంగా జరుపుకునే సంక్రాంతి వేడుకలను జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. నిరుపేదలు సైతం పండుగను వేడుకగా నిర్వహించుకోవడంలో భాగంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉప అధ్యక్షుడు తోట వాసు, సెక్రటరి జాకీర్ హుస్సేన్, శివ రామకష్ణ , శ్రీనివాస్, రమేష్, జగదీష్ తదితరులు.



విజయనగరం: నిరుపేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న సిరి సహస్ర



విజయనగరం రూరల్: పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న పెద్దలు

చీరల పంపిణీ...

విజయనగరం రూరల్: కార్పొరేషన్ పరిధిలోని ధర్మపురంలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రామ పెద్దలు పతివాడ గణపతిరావు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట చందక సూరిబాబు, చందక ఈశ్వరరావు, గిడిజాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు పాటించాలి

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: ప్రతిఒక్కరూ సంస్కృతీ, సంప్రదాయాలను పాటించాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. ధనుర్మాసం ముగింపు సందర్భంగా మండలంలోని మొయిదలో అన్నసమరాధన కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు ప్రజల పెద్ద పండుగైన సంక్రాంతిని మంచి వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ధనుర్మాసం ముగింపు సందర్భంగా గడిచిన 50 ఏళ్లుగా గ్రామంలో భోగి రోజున మహా అన్నసమరాధన చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోషబాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, గ్రామ పెద్దలు కొండపల్లి సూర్యనారాయణ, యడ్ల కృష్ణ, దవళ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో సంక్రాంతి సంబరాలు



చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన అనంతరం అర్చకులు ఉత్తర రాజగోపురం వద్ద సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భోగి మంట వేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చిన్నారులపై భోగిపళ్లను పోసి ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. భోగి రోజున చిన్నారులపై భోగిపండ్లు పోయడం వల్ల మహావిష్ణువు ఆశీస్సులు లభిస్తాయని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ కిషోర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతిబింబం రంగవల్లులు



రంగోలి పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం టౌన్: సనాతన హైందవ సంప్రదాయానికి ప్రతిబింబం రంగవల్లులని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. కళలకు కాణాచి, పుట్టినిల్లు అయిన విజయనగరంలో సంస్కృతీ, సంప్రదాయాలు ఫరిఢవిల్లుతున్నాయని చెప్పారు. వాజీ చానల్ నిర్వహించిన రంగోలీ, మెగా హౌసీ లక్కీడ్రా విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలలో ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికితీయడమే కాకుండా సంప్రదాయాలు, సంస్కృతిని గౌరవించేలా వ్యవహరిస్తున్న వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు స్ఫూర్తిప్రదాతని కొనియాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వాజీ చానల్ ఎం.డి శ్రీనివాసరావు మాట్లాడుతూ విజయనగరం ప్రజల్లో వాజీ చానల్ రంగోలి పోటీలు అంతర్భాగమైపోయాయన్నారు. ఈ ఏడాది హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, నెల్లూరు, విశాఖ నుంచి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారన్నారు. రంగోలి పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో ఉమాదేవి, బి.మాధవి, ప్రత్యూషలు నిలిచారని చెప్పారు. అనంతరం మెగా హౌసీ లక్కీడ్రా విజేతలకు బహుమతులందించారు. ఈ సందర్భంగా నర్తనశాల, అమృత శ్రీవర్షిణి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ విద్యార్థుల ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గజపతినగరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కేఏ నాయుడు, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, గుండమ్మ కథ సీరియల్ నటి పూజామూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మామిడికి మంచు దెబ్బ

- సుమారు 20 వేల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లే అవకాశం
- ఆందోళనలో రైతులు

పూసపాటిరేగ: కొద్ది రోజులుగా కురుస్తున్న పొగ మంచుతో మామిడి పంటకు నష్టం వాటిల్లుతోంది. కొన్నిచోట్ల పూత రాకపోవడం, మరికొన్ని చోట్ల పూత రాలిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉద్యానవనశాఖ అధికారులు తగిన సూచనలు, సలహాలు అందించాలని రైతులు కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాలలో మామిడి సాగవుతోంది. ఏటా డిసెంబర్, జనవరి నెలల్లో మామిడి పూత వస్తుంది. పూత వచ్చినప్పుడు వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వస్తాయి. కాని కొన్ని రోజులుగా అధికంగా కురుస్తున్న మంచు కారణంగా మామిడి దిగుబడికి కోలుకోలేని దెబ్బ తగులుతోంది. ప్రస్తుతం పూత దశలో ఉన్న మామిడికి మంచు తీవ్ర నష్టం కలిగిస్తోంది. తోటలను కౌలుకు తీసుకున్న రైతులు మాత్రం భారీగా నష్టపోయే అవకాశం ఉంది. గతేడాది కూడా ఇదే మాదిరిగా మంచు కురవడంతో పంట తీవ్రంగా నష్టపోయామని రైతులు తెలిపారు. పూత నిలవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు సలహాలు, సూచనలు అందించాలని రైతులు కోరుతున్నారు.



పూసపాటిరేగలో మంచుకు దెబ్బతిన్న మామిడి



మాడిన పూతను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అసిస్టెంట్

పూత మాడిపోయింది..

పది రోజులుగా కురుస్తున్న మంచుకు పూత మాడిపోయింది. ఇదేవిధంగా మంచు పడితే దిగుబడి పూర్తిగా ఉండదు. ప్రకృతి వైపరిత్యాల వల్ల నష్టపోతున్నాం. ఉద్యానవన అధికారులు తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

– కె. వెంకటరావు, రైతు, పూసపాటిరేగ

సలహాలు అందిస్తున్నాం..

మామిడితోటకు నష్టం వాటిల్లకుండా ఉద్యానవన రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం, పొగమంచు అధికంగా ఉండడంతో తేనె మంచుపురుగు ఆశిస్తుంది. ఇవి పూత, పిందెలు, కాడల రసాన్ని పీలుస్తాయి. పురుగు నివారణకు, పూత నిలవడానికి తిమోతాక్సమ్ 0.5 ఎంఎల్ లేదా ఇమిడోక్లోప్రిడ్ 0.5 ఎంఎల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మామిడి కాయలపై నల్లని మచ్చలు రాకుండా లీటర్ నీటిలో మూడు గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి.



– జ్యోత్స్న, ఉద్యానవనశాఖ అధికారి, భోగాపురం